# దెయ్యాల కథ

-తమిరిశ జానకి

ఇంటి ముందు ఏదో హడావిడి... మాటలు... చప్పుళ్లు వినిపించి కిటికీలోంచి బయటకు చూసాడు నాగేంద్ర.

చూస్తూనే నోరెళ్లపెట్టాడు. కారణం... ఎదురింటి గేటు ముందు మినీ లారీలోంచి సామాన్లు దింపుతున్నారు.

మరు నిముషంలో కోపం కళ్లల్లో ఎరుపురంగు పులిమింది. కారణం ఆ ఇల్లు అమ్ముడైపోయిందా అన్న ఆశ్చర్యం కలిగించిన ఈర్ష్య.

ఎలా అమ్ముడైంది? ఎప్పుడమ్మకం అయింది? తనకి తెలియలేదే? బయటకొచ్చి వరండాలో నిలబడ్డాడు.

పొడుగ్గా, బలంగా, చామనఛాయ రంగులో వున్న వ్యక్తి చిరునవ్వు నవ్వాడు పలకరింపుగా. ఆయనే లారీలోంచి సామాను దింపిస్తున్నాడు. సుమారు డెబ్బయ్యేళ్లుంటాయేమో!

కానీ మనిషి దృఢంగా ఉన్నాడు. ఆయన పలకరింపుకి బదులుగా తనూ నవ్వాడు. కానీ అది ఏడవలేక నవ్విన నవ్వు.

"నా పేరు గరుడస్వామి... మీరూ?" దగ్గరకొచ్చాడు చెయ్యి చాపుతూ.

అదేం పేరు? వింతగా ఉంది... మనసులో అనుకుంటూ కరచాలనం చేసాడు.

"నా పేరు నాగేంద్ర. మీరొస్తున్నారా ఈ ఇంట్లోకి?"

"ఔనండీ... నేను కొన్నాను ఈ ఇల్లు."

"చాలా తొందరపడ్డారు."

"ఏం? ఎందుకలా అంటున్నారు?"

"మీకు తెలియదా పాపం? ఔన్లేండి తెలిస్తే ఎందుకు కొంటారు పాపం?"

"ఆ పాపాలేమిటండీ బాబూ. కాస్త అర్థమయ్యేలా చెప్పండి."

"నిజంగా చెప్పెయ్యమంటారా? వొద్దులెండి. చెప్పానంటే లోపల పెట్టిస్తున్న సామానంతా వెంటనే మళ్లీ లారీలోకి ఎక్కించి వెనక్కి తిరిగి చూడకుండా ఎక్కడనుంచి వచ్చారో అక్కడికి వెళ్లిపోతారు."

"ఫర్వాలేదు సార్ చెప్పండి."

"ఆ ఇంట్లో దెయ్యాలున్నాయండీ..."

వింటూనే గరుడస్వామి గుండె గుభిల్లుమంటుందనీ, ఆ మొహంలో భయం కనబడుతుందనీ ఆశగా చూసాడు. అలాంటి ఛాయలేం కనబడలేదు.

"అందుకే సార్... అందుకే ఈ ఇల్లు కొన్నాన్నేను. ఈ ఇంట్లో దెయ్యాలున్నాయన్నమాట అబద్ధమేమో, ఊరికే అలా చెప్పారేమో అని భయపడి ఛస్తున్నానుకోండి. అమ్మయ్య దెయ్యాలున్నాయని ఇంటెదురుగా ఉన్న మీరు రూఢీగా చెబుతుంటే ఇప్పుడు తృప్తిగా ఉంది నాకు. ఆనందం పట్టలేకపోతున్నాను."

ఈ మనిషికి పిచ్చి పట్టలేదుకదా... అనుమానంగా చూసాడు నాగేంద్ర.

దెయ్యాలున్నాయని చెప్తే తృప్తిగా ఉందంటాడేమిటి? ఎవరైనా దెయ్యాల్లేవంటే అమ్మయ్య అనుకుంటారుగానీ...!

"నా మాటలు మీకు ఆశ్చర్యంగా ఉన్నట్టున్నాయి. నేను దెయ్యాల మీద రీసెర్చ్ చేస్తున్నాను."

"దెయ్యాలమీద రీసెర్చా?" గుండెలమీద చెయ్యేసుకున్నాడు.

"ఔనండీ...అందుకే దెయ్యాలున్నాయని చెప్పుకునే ఇళ్లకోసం వెతికాను. లక్కీగా ఈ ఇల్లు దొరికింది."

ఓరినాయనో... ఇదేం మనిషి? ఇలాంటివాళ్ళు కూడా ఉంటారా? తన ప్లానంతా వృధా అయిపోయిందికదా. ఔనుమరి. అసలీ దెయ్యాల ప్లాను తనదే కదా.

ఆ ఇంటి యజమాని అద్దెకున్నవాళ్లని ఖాళీ చేయించి ఇల్లు అమ్మకానికి పెట్టగానే పాతిక లక్షలు ఖరీదుచేసే ఆ ఇంటిని ఎనిమిది లక్షలకు అడిగాడు తను.

ఆ ఇంటికి ఇటుపక్క అటుపక్కా ఖాళీ స్థలాలు. ఇంటి వెనుక కూడా ఖాళీ స్థలమే. ఎప్పుడో ముందు ముందు పడతాయి ఇళ్ళు. ఇంటికెదురుగా తన ఇల్లు... మిగిలిన ఇల్లు అక్కడొకటీ... ఇక్కడొకటీ విసిరేసినట్లు కాస్త దూరంగా ఉన్నాయి.

ఇల్లు చూసుకెళ్లేవాళ్లు చూసి వెళ్తున్నారు అప్పుడప్పుడొచ్చి. నాలుగైదు నెలలు గడిచిపోయాయి.

ఎలాగైనా ఏడెనిమిది లక్షలకే ఆ ఇల్లు కొట్టెయ్యాలన్న ఉద్దేశ్యంతో ఆ ఇంట్లో దెయ్యాలు తిరుగుతున్నాయని పుకారు పుట్టించింది తనే కదా. ఇల్లు చూసుకునేందుకు వచ్చిన వాళ్ళు అయ్యబాబోయ్... బతికుంటే బలుసాకు తినవచ్చని పాతిక లక్షలు కాదుకదా పదిలక్షలకే ఇచ్చినా మాకొద్దని పారిపోయేలా చేయగలిగాడు తను. కానీ ఇప్పుడిలా కథ అడ్డం తిరిగిందేమిటి? ఇల్లెప్పుడు చూసుకున్నాడు ఈయన? ఎప్పుడు కొన్నాడు?


తనకేమీ ఉప్పందలేదే? ఎప్పటికప్పుడు ఉప్పందించే ఆ వాచ్‌మెన్ వీరయ్య సాయంవల్ల ఇల్లు కొనుక్కోవడానికి వచ్చేవాళ్లందరికీ దెయ్యాల కబురు చెప్పి బెదరగొట్టి మళ్లీ వెనక్కి తిరిగి చూడకుండా వాళ్ళు వెళ్లిపోయేలా చేస్తున్నాడు ఇన్నాళ్ళు. ఈయనెప్పుడొచ్చి చూసుకున్నాడు? ఎప్పుడు బేరం కుదుర్చుకున్నాడు? ఆ వీరయ్యకూ్కడా తెల్సినట్లు లేదు. తెలిస్తే చెప్పడూ?

"ఏమిటండీ ఏదో ఆలోచనల్లో పడ్డారు?"

"అబ్బే ఏంలేదు. ఏం లేదండీ... మీ ఫ్యామిలీ..." అర్థోక్తిలో ఆగిపోయాడు.

"మా ఆవిడ పోయి నాలుగేళ్లయిందండీ. మా పెద్దబ్బాయి కోడలు వాళ్ళు ఢిల్లీలో ఉన్నారు.

చిన్నబ్బాయి కోడలు వాళ్ళు బెంగుళూర్లో ఉన్నారు. నేను సర్వీస్‌లో ఉండగా ఊళ్ళు తిరుగుతూ ఉండేవాడిని ట్రాన్స్‌ఫర్ మీద. రిటైరయ్యాక పిల్లల దగ్గరున్నాం నేనూ మా ఆవిడ.''



"మరిప్పుడు మీరొక్కరూ ఎందుకిక్కడ? పైగా ఇల్లు కొనడం కూడా...''

"ఇది మా సొంత ఊరు... అందుకని. మా పిల్లలు రిటైరయ్యాక ఇక్కడికే వచ్చి సెటిల్ అవుతామన్నారు. మా పెద్దబ్బాయి వీఆర్‌ఎస్ తీసుకుని వచ్చేస్తానంటున్నాడు కూడా. అందుకని ముందే నేనొచ్చి వాళ్లకిక్కడ ఏర్పాటు చేద్దామని ప్రయత్నాలు మొదలుపెట్టబోతున్నాను. దెయ్యాలమీద రీసెర్చ్ చేయాలన్న నా కోరిక ఈ ఊళ్ళోనే తీరబోతోంది. ఈ ఇంట్లో దెయ్యాలు తిరుగుతుంటాయని వాళ్ళూ వీళ్లూ అనుకోగా విన్నాను. వెంటనే కొనేసాను'' వివరంగా చెప్పాడు గరుడ స్వామి, నాగేంద్ర మొహంలోకి పరీక్షగా చూస్తూ.

★★★

"ఏమండీ?'' పిల్చింది పంకజం.

"ఏమిటి?''

పదిన్నరకి పడుకోబోతున్న నాగేంద్ర అడిగాడు భార్యని.

"అటు చూడండి భయమేస్తోంది."

"ఏముంది? ఎందుకూ భయం?"

"ఆ ఎదురింటివైపు చూడండి" వొణికిపోతూ మంచంమ్మీద దుప్పటి ముసుగులో దూరింది పంకజం.

కిటికీలోంచి ఎదురింటివైపు చూసిన నాగేంద్ర బిగుసుకుపోయాడు.

ఆ ఇంట్లో లైట్లన్నీ ఆర్పేసి ఉన్నాయి. వీధి తలుపు, అద్దాల కిటికీ తలుపులు అన్నీ వేసే ఉన్నాయి.

లోపలి గదుల్లో ఒక దీపం గాల్లో తిరుగుతోంది.

అద్దాల కిటికీలోంచి ఆ తిరుతున్న దీపం వెలుతురు, మంట కనబడుతోంది.

భార్య మాటలకు బిసుసుకుపోయిన నాగేంద్రలో కదలిక వొణుకుడు రూపంలో వచ్చింది.

ఎలాగైతేనేం పాక్కుంటూ కిటికీదాకా వెళ్లి చటుక్కున ఒక్కసారిగా లేచాడు.

కిటికీ తలుపులు గభాల్న వేసేసాడు.

"ఎందుకండీ అలా పాక్కుంటూ వెళ్లడం?"

"భయంతో ఛస్తున్నా నీ ప్రశ్నలు మాత్రం మానవుకదా పంకజం. నిలబడితే ఆ దెయ్యానికి నేను కనబడిపోతానని పాక్కుంటూ వెళ్లాను" తను కూడా దుప్పటి ముసుగేసుకుని మంచం నడి మధ్యలో కూర్చున్నాడు.

"మంచినీళ్ళు కావాలి. దాహం..."

"అమ్మో... వంటింట్లోకి వెళ్ళే ధైర్యం లేదండీ ఇప్పుడు. నాక్కూడా నాలిక పిడచకట్టుకుపోయింది."

మెల్లగా మంచం దిగబోయాడు నాగేంద్ర.

"బాబోయ్... మీరు కూడా వెళ్లకండి."

"ఎలా మరి? నోరెండిపోతోంది. దాహం...దాహం."

"సరే అయితే. ఇద్దరం కలసి వెళ్దాం రండి."

"పద"

ముందు భరించువాడు...వెనుక కార్యేషుమంత్రి.... భరించువాడి అడుగులో అడుగువేస్తూ భయాన్ని మర్చిపోవడానికి సన్నగా కూనిరాగం తీసింది. "నీ అడుగులోన అడుగు వేసి నడువనీ నన్నూ నడువనీ..."

"నీ ఇల్లు బంగారంగానూ... ఇప్పుడెలా పాటలు పాడగలుగుతున్నావు బాబూ. అయినా పెళ్లయిన ఇన్నేళ్లకి ఈ దెయ్యాలవల్ల నా అడుగులో అడుగు వేస్తున్నావుగానీ నేను సినిమాకెళ్దాం అన్నప్పుడు గుడికెళ్దాం అంటావు.

నేను గుడికెళ్దాం అన్నప్పుడు సినిమాకెళ్దాం అంటావు. రోడ్డుమీద నడుస్తున్నప్పుడు నేను ఎడమ చేతివైపు నడిస్తే నువ్వు రోడ్డుకటుసైడు కుడిచేతివైపు నడుస్తావు. నేను కుడిచేతివైపు..."

"అబ్బబ్బ...గిల్లికజ్జాలకిదా సమయం? మనం వాదించుకుంటూ కూర్చుంటే ఆ దెయ్యమేదో ఆ ఇంట్లోంచి మనింట్లోకొచ్చినా వస్తుంది."

"అయ్యబాబోయ్" ఒక్కవురుగున వెనక్కివెళ్లి మళ్లీ మంచం ఎక్కేసాడు నాగేంద్ర.

దాహం సంగతి మర్చిపోయి ఆంజనేయ దండకం అందుకున్నాడు.

***

మర్నాడూ... ఆ మర్నాడూ కూడా ఎదురింట్లో చీకట్లో దీపం నడవడం ఇదే వరుస.

ఠారెత్తిపోయారు నాగేంద్ర, పంకజం దంపతులు.

నాలుగోరోజు ఇక ఉండలేకపోయాడు.

"ఏవండీ గరుడస్వామిగారూ!"

"స్వామి అంటే చాల్లెండి. పూర్తి పేరు అక్కర్లేదు."

"స్వామిగారూ... మీ ఇంట్లో..."

"ఆ.. మా ఇంట్లో?"

"మీ ఇంట్లో... రాత్రిళ్ళు..."

"ఆ రాత్రిళ్ళు...?"

"రాత్రిళ్ళు.."

"ఏమిటండీ ఏదో అడగడానికి అంత భయపడిపోతున్నారు?"


"అదేనండీ మరి...మరి..."

"చెప్పండి."

"మీ ఇంట్లో దీపాలు రాత్రిళ్ళు గాల్లో నడుస్తున్నాయేమిటి?"

ప్రశ్న అడగడం పూర్తిచేసి వీపుమీద మూడుసార్లు తనకి తనే కొట్టుకున్నాడు.

"ఓ అదా... దెయ్యాల్లెండి?" అదేమంత పెద్ద విషయం కాదన్నట్లు చప్ప



## అవకాశాల వరద

నటుడు షారూక్‌ఖాన్ ఇప్పుడు అవకాశాల వరదలో కొట్టుకుపోతున్నట్టున్నాడు. ఓ పక్క వ్యాపార ప్రకటనలతో బిజీగా ఉన్న ఈహీరో తాజాగా షిమిత్ అమీన్ దర్శకత్వంలో యశ్‌రాజ్‌ఫిల్మ్ కొత్త చిత్రంలో నటిస్తున్నాడు. దిల్‌వాలే దిల్హానియె లే జాయేంగే, దిల్ తో పాగల్ హై, మొహబ్బతీన్ చిత్రాల తరహాలో ఈ చిత్రం కూడా హిట్ అవుతుందంటున్నారు. 'దార్' అని పేరు పెట్టిన ఈ చిత్రంలో షారూక్ యూత్‌ని ఆకర్షించేలా తనని తాను తీర్చిదిద్దుకుంటున్నాడు. ఈ ఫార్ములా ఎంతవరకూ వర్కవుట్ అవుతుందో చూద్దాం.



రించేసాడు.

"అయ్యబాబోయ్ నిజంగా దెయ్యాలా?"

"అదేమిటండీ అంతలా ఆశ్చర్యపోతారు? ఈ ఇంట్లో దెయ్యాలున్నట్లు మొదటే మీకు తెల్సుకదా? ఇప్పుడే మొదటిసారి వింటున్నట్లు అలా మొహం పెట్టారేంటి?"

"ఆ... అబ్బే... లేదు...లేదు... ఔనను..." తడబడిపోయాడు.

"మీరంత భయపడిపోనక్కర్లేదండీ. దెయ్యాలు మనుషులకంటే చెడ్డవేం కాదు. మనం స్నేహం చేస్తే మనతో చక్కగా ఉంటాయవి. నిజం చెప్పాలంటే నేను దెయ్యాలమీద రీసెర్చ్ ఇప్పుడే కొత్తగా మొదలుపెట్టలేదు. ఈ ఊరు రాకముందే మొదలుపెట్టాను.

ఇప్పుడీ ఇంట్లో తిరుగుతున్న కొన్ని దెయ్యాల్లో ఓ రెండింటిని మీ ఇంటి మీదకి పంపుదామనుకుంటున్నాను. అలాంటి ప్రయోగం ఒకటి నేర్చుకుంటు న్నాను. మీ ఇంటిని చక్కగా కాపలా కాస్తాయవి. దొంగలకి భయపడే పనుండదు అప్పుడు."

"ఓర్నాయనోయ్" ఒక్క అరుపుతో ఒక్క పరుగుతో ఇంట్లోకెళ్లిపడ్డాడు.

***

"ఏమిటి? మీ ఇల్లు అమ్మకానికి పెడుతున్నారా? మీరీ ఇంట్లోంచి వెళ్లిపో తున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు గరుడస్వామి.

"ఔనండీ రేపు ఇల్లు ఖాళీ చేసేస్తున్నాం. ఇల్లు అమ్మకం గురించి పేపర్లో ప్రకటన ఇచ్చేసాను. ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఇల్లు అద్దెకు చూసుకున్నాను.

ఇంటి తాళం చెవి మీకిచ్చేసి వెళ్తాను. కాస్త ఏమనుకోకుండా ఎవరైనా ఇల్లు చూసుకోవడానికి వస్తే చూపిస్తారా?"

"ఎంతకమ్ముతున్నారు?"

"ఇరవై లక్షలు"

"మీ ఇంటి ఎదురింట్లో అంటే అదేలెండి మా ఇంట్లో దెయ్యాలున్నప్పుడు ఇరవై లక్షలకి మీ ఇల్లు అమ్ముడుపోదండీ. అయిదు లక్షలకి ఇచ్చేట్టయితే చెప్పండి ఈ రోజే డబ్బిచ్చేస్తాను."

"మీరే కొంటారా?"

"ఆ కొంటాను. ఏం చేయను మరి? మా ఇంట్లో దెయ్యాలున్నప్పుడు ఎదురిల్లు కొనుక్కోవడానికి ఎవ్వరూరారు మీకు పాపం. తెలియని వాళ్లెవరైనా కొనుక్కునేందుకు వచ్చినా మా ఇంట్లో దెయ్యాలున్నాయని నేనెలాగో చెప్పనే చెప్తానుకదా. అప్పుడింక అలా అలా మీ ఇల్లు పాడుబడిపోతుంది. మా ఇంట్లోంచి ఓ రెండుమూడు దెయ్యాలు కులాసాగా వెళ్లి మీ ఇంట్లో కాపురం పెట్టకా మానవు."

"మీకు పుణ్యం వుంటుంది. మరీ అయిదులక్షలు కాదు కనీసం పది లక్షలివ్వండి."

"మీరంతగా బతిమాలితే తప్పుతుందా? మీ మాటా కాదు నా మాటా కాదు. మధ్యేమార్గం. ఏడులక్షలిస్తాను. ఇచ్చేట్టయితే ఇవాళే ఖాయం చేయండి. లేకపోతే రేపే నేను ఇంకో చోట కొనెయ్యబోతున్నాను."

ఇంటికెళ్లి భార్యతో కలసి చాలా సీరియస్‌గా ఆలోచించి ఏడులక్షలకి గరుడస్వామికి ఇల్లు అమ్మేసాడు నాగేంద్ర.

***

"థాంక్స్ విఠల్‌రావుగారూ... మా ఇల్లు మీరు పాతిక లక్షలకి కొనడమే కాదు మోసగాడిని మోసంతోనే గెలవాలని నిరూపించారు. ఆ వీరయ్యవల్ల మీకూ నాకూ కూడా నిజం తెలియబట్టి దెయ్యాల పుకారు పుట్టించి పాతికలక్షల విలువైన నా ఇల్లు అయిదు లక్షలకి కొట్టేద్దామని ప్లానేసిన ఆ నాగేంద్రని ఫూల్ చేసి ఇరవై లక్షలు పలికే వాడిల్లు వాడంతటవాడే ఏడులక్షలకి అమ్ముకు పోయేటట్లు చేసారు.

మొత్తమ్మీద మీ ఇద్దరబ్బాయిలకి రెండు పెద్ద ఇళ్ళు ఒకేచోట కొనేసారు. మీ తెలివి అమోఘం..."

"చీకట్లో పైనుంచి కిందవరకూ నల్ల ముసుగులో రెండు చేతుల్లోనూ రెండు కొవ్వొత్తులు పట్టుకుని వాళ్ల కిటికీల్లోంచి కనబడేలా తిరిగేవాడిని. అంతే తారెత్తిపోయారు" పకపకా నవ్వాడు విఠల్‌రావు.

"తాడిని తన్నేవాడుంటే వాడి తలని తన్నేవాడు ఉంటాడని తెలియదు కాబోలు నాగేంద్రకి.

వాడు నాగేంద్రుడు కాబట్టి మీరు పేరు మార్చుకుని గరుత్మంతుడిలా వెళ్లి వాడి పనిపట్టారు. మీకు మరీ మరీ నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను" మన స్ఫూర్తిగా చెప్పాడు విఠల్‌రావుకు ఇల్లమ్మిన పెద్దాయన.

★

## రామాయణ ప్రాశస్త్యం

మహాకవి వాల్మీకి రాసిన రామాయణాన్ని పలుభాషల్లోకి అనువదించారు. మొట్టమొదటిసారిగా రామాయణం అస్సామీ భాషలోకి తర్జుమా చేశారు. 14వశతాబ్దంలో మాధవకంధాళి అనే రాజాస్థాన పండితుడు రామాయణాన్ని కంధాళి రామాయణం అనే పేరుతో అస్సామీలోకి అనువదించారు. ఆయనకు రాజు వరాహ రాజా మహామాణిక్య ఎంతగానో సాయం చేశారు. వాల్మీకి రామాయణ మూలప్రతికి ఆయన ఎలాంటి మార్పులు చేయకుండా ఏడుఖండాలుగా విభజించి తర్జుమా చేశారు. వీటిలో మొదటి, ఆఖరి ఖండాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మిగిలినవి పదిలంగా ఉన్నాయి.

## సత్యదినోత్సవం

అమెరికాలోని విస్కాన్సన్ రాష్ట్రం మే2న సత్యదినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఆ రాష్ట్రంలోని మాండెల్లా నగరంలో రెండువేలమంది ఓ స్మృతిచిహ్నం వద్ద సమావేశమవుతారు. అక్కడ ఒక కుర్రవాడి స్మృతిఫలకం ఉంది. 'నిజాన్ని పరిరక్షించేవారికోసం స్వర్గం నిరీక్షిస్తుంటుంది' అని ఆ ఫలకం మీద చెక్కబడి ఉంటుంది. చేయని నేరానికి ఓ కుర్రాడు ఆప్రాంతంలో శిక్షకి గురయ్యాడని చెప్తారు. ఆ కుర్రవాడు నిజాన్ని బ్రతికించడం కోసం తాను ఉరిశిక్షకు బలయ్యాడు. ఆ కుర్రాడి సత్యమార్గానికి గురుతుగా అందరూ కలిసి మే రెండవతేదీని సత్యదినోత్సవంగా జరుపుకుంటారు

-రమణకుమార్

